AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
25-11-2025 (Tuesday)
MAIN EDITION

## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** పసిడి ప్రియులు, కొనుగోలు దారులకు బంగారం ధరలు గట్టి షాకిచ్చాయి. నిన్న బంగారం ధర స్వల్పంగా తగ్గగా.. నేడు భారీగా పెరిగింది. 24 క్యారెట్ల బంగారం రూ.1910, 22 క్యారెట్ల బంగారం రూ.1,750 మేర పెరిగాయి. దీంతో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,27,040, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,16,450కి చేరుకున్నాయి. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. మంగళవారం కిలో వెండి ధర ఏకంగా రూ.3వేలు పెరిగి రూ.1,74,000కు చేరింది. తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు దాదాపు ఇవే ధరలు ఉంటాయి.

## భగ్గుమన్న అఫ్గాన్ పాక్ సరిహద్దు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అఫ్గానిస్థాన్ పాకిస్థాన్ సరిహద్దుల్లో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. అఫ్గాన్ వాణిజ్యమంత్రి అల్హాజ్ నూరుద్దీన్ అజజ్ ప్రస్తుతం భారత పర్యటనలో ఉండగా.. ఆ దేశంపై పాకిస్థాన్ డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. గత అర్ధరాత్రి అఫ్గాన్‌లోని ఖోస్ట్ ప్రావిన్స్‌పై దాడులకు పాల్పడింది. దాడుల్లో సరిహద్దుల్లో ఉన్న ఇళ్లు ధ్వంసమవ్వగా 9 మంది చిన్నారులు సహా 10 మంది మృతి చెందారు. ఈ మేరకు తాలిబన్ ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది.

## ప్రభుత్వ విప్‌కు తప్పిన ప్రమాదం



**అక్షరటుడే, సిరిసిల్ల:** ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రమాదం తప్పింది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. కలెక్టర్ గరీమా అగర్వాల్, ఇతర అధికారులతో కలిసి ఇళ్లను పరిశీలి స్తుండగా.. ఒక్కసారిగా ఫ్లోరింగ్ కూలింది. వెంటనే కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కింద పడకుండా పట్టుకున్నారు.

## అమెరికా వెళ్లనున్న నారా లోకేశ్



**అక్షరటుడే, అమరావతి:** ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. డిసెంబర్ 6న అమెరికాకు పయనమవ్వనున్నారు. 9వ తేదీ వరకూ అమెరికాలో పర్యటించనున్న ఆయన.. తొలిరోజు డల్లాస్‌లో తెలుగు కమ్యూనిట విత్ నారా లోకేశ్ అనే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చేసిన హైడ్రా



**అక్షరటుడే, మేడ్చల్ :** ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేశారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరి గూడలో 800 గజాల అసైన్డ్ ల్యాండ్ కబ్జా అయింది. అయితే అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు.

## ఆర్మీ అధికారి తొలగింపు సబబే: సుప్రీం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** మతపరమైన పరేడ్‌లో పాల్గొనేందుకు నిరాకరించిన క్రైస్తవ ఆర్మీ ఆఫీసర్‌ను విధుల్లో నుంచి తొలగించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఇది సైనిక అధికారిగా అతని క్రమశిక్షణా రాహిత్యమన్నారు. దీని ద్వారా అతను ఎలాంటి సందేశం పంపుతున్నాడని ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ కామెంట్స్ చేశారు. ఈ అంశంలో ఆర్మీ నిర్ణయాన్ని సమర్థిస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఒక వ్యవస్థగా ఆర్మీ లౌకికమైందని, దాని క్రమశిక్షణ విషయంలో రాజీ పడలేమని తేల్చి చెప్పింది. సైన్యం ఒక లౌకికమైన సంస్థ అని అయితే క్రమశిక్షణలో రాజీపడలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది.

## హబ్సిగూడలో విద్యార్థిని ఆత్మహత్య

**అక్షరటుడే, హైదరాబాద్:** హబ్సిగూడలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక సోమవారం తెల్లవారు జామున ఐదంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నెలలుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడనుంది. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానుంది. జీపీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల సంఘం సైతం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీ ప్రదర్శించింది. మరోవైపు ప్రభుత్వం సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేసింది. దీంతో గ్రామాల్లో ప్రజలు, నాయకులు ఎన్నికల కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం మంగళవారం సాయంత్రం షెడ్యూల్ విడుదల చేయడానికి సిద్ధం అయింది.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# పంచాయతీ ఎన్నికలకు మోగనున్న నగారా

- నేడు షెడ్యూల్ విడుదల చేయనున్న ఈసీ
- మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం
- ఆశావహుల్లో ఉత్కంఠ

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. నవంబర్ 25న సాయంత్రం 6:15 గంటలకు ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల నిర్వహణపై వివరాలు వెల్లడించనున్నట్లు పేర్కొంది. డిసెంబర్ రెండో వారంలో ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్పటికే ప్రభుత్వం తెలిపిన విషయం తెలిసిందే. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగ్ తేదీల వివరాలను ఎన్నికల సంఘం వెల్లడించే అవకాశం ఉంది. జిల్లాల వారీగా సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల గెజిట్లు పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్‌కు సోమవారం మధ్యాహ్నం చేరుకున్నాయి.


### 12,760 గ్రామాల్లో..

రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉండగా.. 31 జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. హైదరాబాద్, మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో గ్రామాలు లేవు. దీంతో అక్కడ ఎన్నికలు ఉండవు. మిగతా 31 జిల్లాల్లోని 12,760 గ్రామాలు, 1,13,534 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. వార్డు సభ్యుల రిజర్వేషన్లను బీసీ కుల గణన ప్రకారం ఖరారు చేశారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లను కుల గణన ఆధారంగా, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ప్రకారం కేటాయించారు. మొత్తం సీట్లలో 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేశారు.

### మూడు దశల్లో..

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహిస్తారని సమాచారం. డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో తీసుకు వచ్చినట్లు బీసీలకు 27శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అయితే కాంగ్రెస్ మాత్రం 42 శాతం టికెట్లను పార్టీ పరంగా బీసీలకు కేటాయిస్తామని ప్రకటించింది. దీంతో మిగతా పార్టీలు కూడా అదే బాట పట్టే అవకాశం ఉంది.

## అయోధ్యలో అద్భుత ఘట్టం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** శ్రీరామ జన్మభూమి అయోధ్యలో అద్భుత ఘట్టం చోటు చేసుకుంది. ఆలయ నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో మంగళవారం ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరై ఆలయంపై కాషాయ జెండా ఎగుర వేశారు. ధ్వజారోహణం నేపథ్యంలో ఆలయంలో భక్తులకు దర్శనం నిలిపి వేశారు. మంగళవారం ఉదయం ప్రధాని మోదీ అయోధ్యకు చేరుకున్నారు. ముందుగా ఆయన సప్తర్షి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాల రాముడిని దర్శించుకున్నారు. ప్రధాని వెంట ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, యూపీ సీఎం యోగి ఆధిత్యానాథ్ ఉన్నారు. అనంతరం మోదీ రామమందిరం పైన కాషాయ జెండాను ఎగురవేశారు. పూజారులు అత్యంత పవిత్రమైనదిగా భావించే అభిజీత్ ముహూర్తంలో ఈ వేడుక నిర్వహించారు. సూర్యుడు, ఓం, కోవిదార్ చెట్టు జెండాపై ఉన్నాయి. 191 అడుగుల ఎత్తయిన ఆలయ శిఖరంపై కాషాయ జెండాను ఎగురవేశారు.

### రామ భక్తుల సంకల్పం సిద్ధించింది..

జెండా ఎగుర వేసిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ రోజు సంపూర్ణ విశ్వం రామమయం అయిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని, భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం అని మోదీ అన్నారు. రాముడు భావోద్వేగాల ద్వారా ఐక్యమవుతాడు, విభజన ద్వారా కాదు అని ప్రధాన మంత్రి అన్నారు.

## మాల వేసుకున్న ఎస్సైకి మెమో.. రాజాసింగ్ ఆగ్రహం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** అయ్యప్ప మాల వేసుకున్న ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు. దీనిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ రూల్స్ హిందువులకే వర్తిస్తాయా అని ప్రశ్నించారు. అయ్యప్ప దీక్ష సమయంలోనే పోలీసులకు నియమ నిబంధనలు గుర్తుకు వస్తాయా అని అన్నారు. ముస్లిం పోలీసులకు చాలా ఫ్రీడమ్ ఇచ్చి హిందూ పోలీసులకు ఎందుకు ఇవ్వట్లేదన్నారు. రంజాన్ సమయంలో ఇలాంటి రూల్స్ ఎందుకు పెట్టరని ప్రశ్నించారు. చట్టాలు అందరికీ సమానంగా ఉండాలని ఆయన సూచించారు. ఇతర మతాల పండుగల సమయంలో సిబ్బందికి ముందు వెళ్లడానికి సమయం ఇస్తారన్నారు. హిందువుల విషయంలో మాత్రమే ఇలా ఎందుకు చేస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దూసుకొస్తున్న సెన్యార్ తుపాన్



**అక్షరటుడే, హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతోంది. బుధవారం నాటికి ఇది తుపాన్‌గా మారనుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలో నవంబర్ రెండో వారం నుంచి చలి తీవ్రతతో ప్రజలు వణికిపోయారు. దాదాపు పది రోజుల పాటు ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పది డిగ్రీల్లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బంగాళాఖాతంలో తేమతో కూడిన వాతావరణంతో నాలుగు రోజులుగా చలి తగ్గింది. అయితే తుపాన్ ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### అతి భారీ వర్షాలు

వాయుగుండం బలపడి తుపాన్‌గా మారిన తర్వాత దానికి సెన్యార్ అని పేరు పెట్టనున్నారు. ఈ తుపాన్‌తో సైతం భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 3 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

## జీహెచ్ఎంసీ మీటింగ్‌లో రచ్చరచ్చ..



**అక్షరటుడే, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆందోళనతో రచ్చ రచ్చ నెలకొంది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమావేశం ప్రారంభం సందర్భంగా వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాలు ఆలపించారు. ఆ సమయంలో కొందరు మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో అలాగే కూర్చొని ఉన్నారు. దీనిపై బీజేపీ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో ఉండాలంటే వందేమాతరం పడాల్సిందేనని నినాదాలు చేశారు. ఈ క్రమంలో బీజేపీ కార్పొరేటర్లకు వ్యతిరేకంగా మజ్లిస్ కార్పొరేటర్లు సైతం ఆందోళనకు దిగారు. దీంతో సమావేశంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

### టేబుళ్ల మీదకు ఎక్కి..

మజ్లిస్, బీజేపీ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రెండు పార్టీల సభ్యులు టేబుళ్ల మీదకు ఎక్కి హంగామా చేశారు. దీంతో మార్షల్స్ వచ్చి వారిని సభ నుంచి బయటకు పంపేందుకు యత్నించారు. సభ జరిగేలా సహకరించాలని మేయర్‌తో పాటు కాంగ్రెస్ సభ్యులు కోరారు.

### బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఆందోళన

సభలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు సైతం ఆందోళన చేపట్టారు. సమావేశం ప్రారంభానికి ముందు బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులతో హాల్‌లోకి వచ్చారు. దీంతో మార్షల్స్ వచ్చి వారి వద్ద ఉన్న ప్లకార్డులను లాక్కెళ్లారు. దీనిపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాల్‌లో ఆందోళన చేపట్టారు. సభ ప్రారంభం కాకముందే మార్షల్స్ హాల్ లోకి ఎలా వచ్చారని ప్రశ్నించారు.

## తెలంగాణలో మరో మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆదేశాలు

**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో మరో మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. వరంగల్ జిల్లాలోని నెక్కొండ మేజర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా మార్చాలని నెక్కొండ మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమున రెడ్డి హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో నోటిఫికేషన్‌కు ముందే నెక్కొండను మున్సిపాలిటీగా గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది.

## నా అందమే నాకు శత్రువైంది



సినీ పరిశ్రమలో హీరోయిన్‌గా నిలదొక్కుకోవాలంటే అందం, ఫిట్‌నెస్, అదృష్టం, టాలెంట్ కావాలని చాలా మంది నమ్మకం. కానీ బాలీవుడ్ నటి దియా మీర్జా కథ మాత్రం ఈ నియమానికి పూర్తి విరుద్ధం. అందం ఉన్న అమ్మాయిలకు అవకాశాలు ఎక్కువగా వస్తాయనే సెంటిమెంట్ ఈ అమ్మడి విషయంలో తలకిందులు అయింది. దియా మీర్జా మరింత అందంగా ఉందన్న కారణంగానే అనేక మంచి అవకాశాలను కోల్పోయినట్లు తనే వెల్లడించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఓ ఇంటర్వ్యూలో సంచలన విషయాలను వెల్లడించింది. ఎక్కువ అందం, క్లాస్ లుక్ వల్ల చాలా మంది దర్శకులు నా విషయంలో వెనక్కి తగ్గేవారని చెప్పింది. నేను కోరుకున్న మంచి స్క్రిప్ట్‌లకు చాలా అందంగా ఉంటానని దర్శకులు నో చెప్పేవారు. ఆ పాత్రకు నిన్ను తీసుకోలేమని చెప్పి తిరస్కరించారు. దియా చెప్పిన ఈ మాటలు ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి.

**–అక్షరటుడే, సినిమా డెస్క్**